www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 17 మార్చి 2024

5

కాకినాడ

నగరంలో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - కాకినాడ

కవాతు నిర్వహిస్తున్న కేంద్రబలగాలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసాగా నగరంలో కేంద్ర బలగాలు కవాతును నిర్వహించాయి. శనివారం నగరంలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహదారిలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రీటౌన్ సిఐ ఎకెకె.భగవాన్ మాట్లాడుతూ రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికలో ప్రజలు తమ ఓటు హక్కును శాంతియుతంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వినియోగించేందుకు ఈ కవాతు ఉపయోగపడుతుందని తెలిపారు. నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు.

మోగిన ఎన్నికల నగారా

ఎన్నికల షెడ్యూల్ విడుదల

అమల్లోకి వచ్చిన కోడ్

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఇప్పటికే జిల్లాలో వేడెక్కిన రాజకీయం ఎలక్షన్ నోటిఫికేషన్ ప్రకటతో మరింత హాట్‌గా మారింది. ఎన్నికల ప్రకటనతో జిల్లా పాలన అధికారుల చేతుల్లోకి మారింది. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి అధికారులు పనులు చాలా వరకూ పూర్తి చేశారు. మిగిలిన వాటినీ వేగవంతం చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ కూయడంతో జిల్లాలో నాయకుల విగ్రహాలకు ముసుగులు పడ్డాయి. ఫ్లెక్సీల తొలగింపునకు రంగం సిద్ధమైంది.

కాకినాడ జిల్లాలో ఓటర్ల వివరాలు

కాకినాడ జిల్లాలో 15,99065 మంది ఓటర్లుగా నమోదయ్యారు. జిల్లా ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రకారం వీరందరూ ఓటర్ల లిస్టులో ఉన్నారు. ఇందులో 7,88,105 మంది పురుష ఓటర్లు, 8,10,781 మంది స్త్రీ ఓటర్లు, 179 మంది ఇతరులుగా ఉన్నారు.

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ బూత్‌లు
తుని	2,20,877	223
ప్రత్తిపాడు	2,13,639	227
పిఠాపురం	2,30,046	242
కాకినాడ రూరల్	2,61,186	264
పెద్దాపురం	2,11,937	200
కాకినాడ సిటీ	2,36,437	233
జగ్గంపేట	2,24,943	248

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదలైంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. నాలుగో విడతలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అవుతుంది. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మే 13న ఎన్నికల పోలింగ్ ఉంటుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలను విడుదల చేస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 21 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే అధికారులు ఎన్నికల ఏర్పాట్లను దాదాపుగా పూర్తి చేశారు. మూడు జిల్లాల్లోనూ 13 వేల మంది ఎన్నికల సిబ్బందిని నియమిస్తున్నారు. 21 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలకు తగ్గట్టుగా ఎన్నికల సిబ్బందిని సమకూర్చుకోవడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 1,637, తూర్పుగోదావరి జిల్లాలో 1,644, కోనసీమ జిల్లాలో 1,569 పోలింగ్ స్టేషన్లున్నాయి. ఒక్కో పోలింగ్ స్టేషన్లో ఒక పీవో, ఒక ఏపీవో, ఇరువురు పోలింగ్ క్లర్కులు, మరో ఇద్దరు విధులు నిర్వహించే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో పాటు 20 శాతం సిబ్బందిని అదనంగా అందుబాటులో ఉంచుతారు.ఇలా మొత్తంగా 13,032 మందితో పాటు 5,814 మంది అదనంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వివిధ శాఖల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు 45 అంశాలతో కూడిన ప్రత్యేక ఫార్మాట్లో అప్లోడ్ చేయాలని ఇప్పటికే అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఉద్యోగులు వ్యక్తిగతంగా అన్ని వివరాలను నమోదు చేసి అప్ లోడ్ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 4,850 పోలింగ్ కేంద్రాలు

మూడు జిల్లాల్లో ఏడేసి అసెంబ్లీ నియోజకవర్గాలుండగా కాకినాడ జిల్లా పరిధిలో 1,637, తూర్పుగోదావరి జిల్లాలో 1,644, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,569 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో సమస్యాత్మకంగా ఉన్న 2,426 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన కేంద్రాల్లో వీడియో కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను చిత్రీకరిస్తారు.

కాజులూరులో వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు

ఎంపి అభ్యర్థి సునీల్

దాడిశెట్టి రాజా

తోట నరసింహం

చంద్రశేఖర్ రెడ్డి

కురసాల కన్నబాబు

దవులూరి దొరబాబు

వరుపుల సుబ్బారావు

వంగా గీత

వైసిపి అభ్యర్థులు వీరే...

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

వైసిపి అభ్యర్థుల తుది జాబితా ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసింది. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో నాలుగు నియోజక వర్గాలను, ఎంపి స్థానాన్ని గతంలో ప్రకటించింది. తరువాత పరిణామాల నేపథ్యంలో వారు ఇన్‌ఛార్జులే అని, తుది ప్రకటన తరువాత చేస్తామని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో టిక్కెట్ల విషయంలో గందరగోళం నెలకొంది. తాజాగా శనివారం తుది జాబితాను వైసిపి అధిష్టానం ప్రకటించింది. జిల్లాలో సిట్టింగ్ ఎంఎల్ఎలు చంటిబాబు, పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, పెండెం దొరబాబులకు తప్ప మిగిలిన అందరికీ టిక్కెట్లు ఖరారయ్యాయి. తుని నియోజక వర్గం నుంచి మంత్రి, సిట్టింగ్ ఎంఎల్ఎ దాడిశెట్టిరాజా రాజా, కాకినాడ అర్బన్ నియోజక వర్గం నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కాకినాడ రూరల్ నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, జగ్గంపేట నుంచి మాజీ మంత్రి తోట నరసింహం, పెద్దాపురం నుంచి దవులూరి దొరబాబు, పిఠాపురం నుంచి వంగా గీతలకు టిక్కెట్లు ఖరారయ్యాఇ. ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ పోటీ చేయనున్నారు.

అభ్యర్థిత్వం ఖరారుతో వైసిపి సంబరాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా తోట నరసింహంను నియమిస్తున్నట్లు వచ్చిన ప్రకటనతో ఆ పార్టీకి చెందిన శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. శనివారం స్థానిక రావులమ్మ ఆలయం వద్ద నరసింహం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ తాను అనారోగ్యంగా ఉన్న తనకు సీటు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. జగన్ సర్వేలలో తాను గెలుస్తానని తనకి సీటు ఇవ్వడం జరిగిందని, నాపై ఉంచిన నమకన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకుడు తోట రాంజీ, నాయకులు ఒమ్మి రఘురాం, అత్తులూరి సాయిబాబు, కాపవరపు ప్రసాద్, రమకుర్తి మూర్తి పాల్గొన్నారు.

సత్వరమే కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - యంత్రాంగం

బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న న్యాయమూర్తి

జిల్లాలోని పలు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాలు జరిగాయి. **కాకినాడ** కక్ష్యలతో జీవించడం కంటే రాజీతో సంతోషంగా బతకాలని కాకినాడ లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.కమలాదేవి అన్నారు. నేషనల్ లోక్ అథాలత్‌లో భాగంగా స్థానిక జిల్లా కోర్టు వద్ద లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలతో ఘర్షణలు పడుతూ ఏళ్ళ తరబడి కోర్టు చుట్టూ తిరగడం కన్నా రాజీతో మంచి వాతావరణంలో జీవించాలని సూచించారు. సామర్లకోటలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అత్యధిక మొత్తంలో రూ. 85 లక్షలు నష్టపరిహారాన్ని ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి హరినారాయణ, పోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వరావు, న్యాయవాదులు, సిఐలు కక్షిదారులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక కోర్టుల సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 241 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ లోక్ అదాలత్ నిర్వహణకు మూడు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌కు 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్ర మౌళీశ్వరి, న్యాయవాది ఎం.రాంబాబు, 2వ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె.దీపా దైవకృప, న్యాయవాది బి.ప్రసాద్, 3వ బెంచ్‌కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్ అధ్యక్షత వహించగా న్యాయవాది ఎ.ప్రభూజి సభ్యులుగా పాల్గొన్నారు. ఈ లోక్ అదాలత్ లలో సివిల్ కేసులు 52, క్రిమినల్ కేసులు 21, మోటారు వాహనాల ప్రమాదపు కేసులు 6, ఫ్రీ లిటికేషన్ బ్యాంకు కేసులు 18, ఫ్రీలిటికేషన్ బిఎస్ఎన్ఎల్ కేసులు 28, క్రిమినల్ చలానా కేసులు 116 పరిష్కారమయ్యాయి. ఈ లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు శ్రీరామ్ ఫైనాన్స్ ఆహారం అందచేశారు. **పిఠాపురం** పిఠాపురం కోర్టు ఆవరణలో శనివారం నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. .ఈ లోక్ అదాలత్‌లో 75 కేసులు పరిష్కారమయ్యా యని 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి తెలిపారు. రెండు బెంచీలు నిర్వహించగా జిల్లా అదనపు జడ్జి ఎ.వాసంతి, మెజిస్ట్రేట్ ఎం.సాయి సుభాష్ ఆధ్వర్యంలో కేసులు పరిష్కారం అవ్వగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగా రాజారావు, కెవిఎస్ భాస్కరరావు, ఎస్ఎం.ఆలీ, కె. పేర్రాజు పాల్గొన్నారు.

పెద్దాపురంలో మాట్లాడుతున్న 7వ అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళేశ్వరి

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మొత్తం ఎన్నికల నిర్వహణకు మొత్తం 12,600 మంది సిబ్బందిని నియమించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఓటరు జాబితాలలో చేర్పులు, తొలగింపులు, మార్పులు కొరకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నాటికి అందిన 6 వేల ధరఖాస్తులను వారం రోజులలో పరిష్కారం పూర్తి చేస్తామని, ఇకపై షెడ్యూల్ ప్రకటన నుంచి నామినేషన్ల స్వీకరణ వరకూ కేవలం కొత్తగా నమోదుల కొరకు మాత్రమే తప్ప తొలగింపులు, మార్పుల కొరకు ధరఖాస్తుల స్వీకరణ ఉండదన్నారు. జిల్లాలో జారీ కావలసిన సుమారు 1 లక్ష ఫోటో ఓటరు గుర్తింపు కార్డులు ప్రింట్ అయి వచ్చాయని, వాటిని వచ్చే 15 రోజులలోపు పోస్టు ద్వారా సంబంధిత ఓటర్లకు బట్వాడా చేయడం జరుగుతుందన్నారు. ఈ విడత ఎన్ని కలలో 85 ఏళ్ల పైబడిన సీనియర్ ఓటర్లు, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు వారి ఇంటి వద్దే హోమ్ ఓటింగ్ సదు పాయం ఎన్నికల కమిషన్ కల్పించిందని, వినియోగించుకోదలచిన వారందరికీ రేపటి నుంచి ఫారమ్ 12(డి) అంద జేస్తామన్నారు. శనివారం నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు లోకి వచ్చిందని, 24 గంటలలో అన్ని కార్యాలయాలలోను, 48 గంటల లోపు అన్ని పబ్లిక్ ప్రదేశాలలోను, 72 గంటలలో అనుమతి పొందని ప్రయివేట్ ఆస్తుల మీద రాజకీయ నాయకుల ఫోటోలు తొలగిం చడం జరుగుతుందన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి మండలంలోను, మున్సిపాలిటీలోను మోడల్ కోడ్ అమలు టీములను ఏర్పాటు చేశామని, శనివారం నుంచి ఈ టీములు విధులలోకి వచ్చాయన్నారు.

21 ఫ్లయింగ్ స్క్వాడ్లు

ఎన్నికలలో ప్రలోభాలను అరికట్టేందుకు 21 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 21 స్టాటిక్ సర్వేలెన్స్ టీములు, 3 అంతర రాష్ట్ర చెక్ పోస్టులు, 5 అంతర జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఎన్నికల కమిషన్ రూపొందించిన ఇఎస్ఎంఎస్ సాఫ్ట్ వేర్‌తో అనుసంధానమై ఈ వ్యవస్థలు అక్రమాలపై పటిష్టమైన నిఘా ఉంచుతాయన్నారు. దీనితోపాటు పౌరులు కూడా ఎన్నికలకు సంబంధించి తమ దృష్టికి వచ్చిన అక్రమాలపై సి-విజిల్ యాప్ ద్వారా గాని, 1950 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసిగాని ఎన్నికల యంత్రాంగానికి సమాచారం అందించవచ్చున్నన్నారు.

కంట్రోల్ రూమ్

జిల్లా స్థాయిలో 0884-2346599, 0884-2346399 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అదేరీతిలో రిటర్నింగ్ అధికారుల స్థాయిలో కంట్రోల్ రూములు పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో 2014 ఎన్నికలలో 78 శాతం, 2019 ఎన్నికలలో 76 శాతం పోలింగ్ నమోదైందని, ఓటర్లను చైతన్య పరచి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

చొల్లంగి దీక్షల విరమణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి భూములు స్థానికులకే ఇవ్వాలని గత 46 రోజులుగా చేస్తున్న రిలే దీక్షలను శనివారం విరమించుకున్నారుఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల అభ్యర్థన మేరకు దీక్షలు విరమించాల్సి వచ్చిందని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చొల్లంగి భూములు స్థానికులకే ఇస్తామని ముమ్మిడివరం టిడిపి ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు హామీ ఇచ్చినందున ఈ దీక్షలను విరమిస్తున్నట్లు టిడిపి మండల పార్టీ కార్యదర్శి కట్టా త్రిమూర్తులు తెలిపారు. శనివారం జరిగిన దీక్షలో కూర్చున్న వారికి ఆయన నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

సూర్యారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సూర్యారావుకు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ, కాకినాడ రూరల్

సిపిఎం నాయకులు వాసంశెట్టి సూర్యారావు 5వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం. రాజశేఖర్, సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జీ మాట్లాడుతూ సూర్యారావు ఉద్యోగిగా ఉంటూ ఉద్యోగ సంఘాల నాయకుడిగా పని చేశారని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సిపిఎం కాకినాడ పట్టణ కార్యదర్శిగా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యునిగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కె.వీరబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పి.వీరబాబు, మలకా రమణ, ఎ.ఏడుకొండలు, ఎ.సుబ్రహ్మణ్యం, ఎజి. సూరిబాబు, కె.సత్తిబాబు, వి.చంద్రరావు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ మండలంలోని ఇంద్రపాలెం అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో సూర్యారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖా కార్యదర్శి సిహెచ్. విజయ్ కుమార్ మాట్లాడుతూ సిపిఎం కాకినాడ పట్టణ కార్యదర్శిగా దశాబ్దకాలం బాధ్యతలు నిర్వహించి అనేక ప్రజా సమస్యలు పరిష్కరించిన ప్రజల నుంచి మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కిరణ్‌కుమార్, త్రిమూర్తులు, రామచంద్రరావు, సిహెచ్‌వి. రమణ, వాసు, సాహిత్, చంద్రరావు, సూర్యకూమారి, పద్మ, సత్య, ఉదయభాస్కర్, రాజు పాల్గొన్నారు. అలాగే వలసపాకల సుందరయ్య కాలనీ లో జరిగిన వాసంశెట్టి సూర్యారావు వర్ధంతిలో సిపిఎం నాయకులు మేడిశెట్టి వెంకట రమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల నీలయ్య, జానకమ్మ, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు

పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - గండేపల్లి

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ నాయక్

ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ జరిగే 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ నాయక్ తెలిపారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో పరీక్షల నిర్వ హణ సిబ్బందికి శిక్షణ కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మూడు సెంట ర్లలో 532 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కార్టూ'నిజం'



దాట్లను గెలిపించాలి : హరీష్

హరీష్ మాధుర్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - కాజులూరు

రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటర్లు రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి దాట్ల సుబ్బరాజును గెలిపించాలని టిడిపి అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గంటి హరీష్ మాధుర్ పిలుపునిచ్చారు. శని వారం మండలంలోని కోలంక దాట్ల విజయ గోపాలరాజు స్వగృహంలో గ్రామ పెద్దలను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రా నికి ఒక్క పరిశ్రమ వచ్చిన దాఖ లాలు లేవన్నారు. ఉపాధి కోసం నిరుద్యోగ యువత రాష్ట్రాన్ని వదిలిపోవాల్సిన దుస్థితిని వైసిపి ప్రభుత్వం తెచ్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచు కుని ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలో చించి జనసేన, బిజెపి బలపర్చిన టిడిపి అభ్య ర్థులను గెలిపిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.సూరి బాబు, వై.చౌదరి, జానకిరామయ్య, డి.బుల్లిరాజు, డి.వంశీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.650 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

కురసాలను అభినందిస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - కరప

రూరల్ నియోజకవర్గాన్ని రూ.650 కోట్లతో అభివృద్ధి చేసినట్లు ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. వైసిపి రూరల్ నియోజకవర్గ అభ్యర్థిగా తనను ప్రకటించిన సందర్భంగా శనివారం ఆయన మండలంలోని వైసిపి గొర్రిపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎల్ఎగా ప్రజలు గెలిపించడం ద్వారా సిఎం జగన్ మంత్రిని చేసి రైతులకు, ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం ఇచ్చారని అన్నారు. మంత్రిగా తనకు అప్పగించిరన బాధ్యతను సంతృప్తికరమైన రీతిలోనే పనిచేసినట్లు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని రూ.650 కోట్లతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. చేసిన అభివృద్ధినే ప్రజలకు తెలియచేస్తూ, మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని ప్రజలకు కోరతానని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, ఎంపిపి పెంచే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరారవు పాల్గొన్నారు.

దేవాలయానికి రూ.3.16 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు వివిధ రూపాల్లో రూ.3.16 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వ హణాధికారి వడ్డి శ్రీనివాస రావు తెలిపారు. వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,70, 530, అన్నదాన విరాళాల ద్వారా రూ.38,309, కేశఖండన ద్వారా రూ 6,920, తులాభారం ద్వారా రూ.350 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ సందర్భంగా యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. దేవస్థానం చైర్మన్ కర్రి వెంకటజగదీశ్వరరావు, ధర్మకర్తలు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పేదలకు సాయం అందిస్తే నిత్య సంతోషం చేకూరు తుందని జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్. వెంకట్రావు అన్నారు. స్థానిక ఎపిఐఐసి కాలనీలో విశ్రాంతి తహశీ ల్దార్ రేలంగి బాపిరాజు సౌజన్యంతో పేద మహిళలకు నిత్యవసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాలలో అండగా నిలిచేవారు భగవంతునికి సేవ చేసినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే స్టేషన్ రెండవ నంబర్ ప్లాట్ ఫారం చివర్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50-60 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహన్ని శనివారం జిఆర్‌పి పోలీసులు గుర్తించి స్టేషన్ మాష్టర్‌కు తెలియచేశారు. అనంతరం ఆ మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనారోగ్య కారణంగా మృతి చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. అతడు బిక్షగాడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థికి చదువు చెబుతున్న భవిత్ ఉపాధ్యాయులు

వికలాంగ బాలలకు గృహ ఆధారిత విద్య

ప్రజాశక్తి - పెద్దాపురం

భవిత సెంటర్‌కు రాలేని నడవలేని, మానసిక స్థితి బాగాలేని పిల్లలకు ప్రతి శనివారం ఐదుగురు పిల్లల ఇంటికి వెళ్లి సహిత సిబ్బంది విద్యా బోధన నిర్వహిస్తున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక దర్గా సెంటర్, పాత పెద్దాపురం పరిసర ప్రాంతాలకు చెందిన ఐదుగురు వికలాంగ బాలలకు విద్యా బోధన నిర్వహించారు. గృహ ఆధారిత విద్యను అందిస్తున్న సమయంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఈ విద్యా బోధనలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టపాసులు పేల్చుతున్న జనసేన కార్యకర్తలు

జనసైనికుల సంబరాలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఉప్పాడ బస్‌స్టాండ్, బంగారమ్మ రావి చెట్టు వద్ద జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయడం సంతోషంగా ఉందన్నారు. లక్ష ఓట్ల మెజారిటీతో పవన్‌ను గెలిపించుకుంటామని, ఆయన గెలుపును ఆపడం ఎవరితరం కాదని అన్నారు. పవన్ గెలుపును ఆపేందుకు సిఎం జగన్ శత విధాల ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టిడిపి ఇన్‌ఛార్జ్ వర్మ టిడిపి అధినేత చంద్రబాబు నుంచి స్పష్టమైన హామీని పొందినందుకు వర్మకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం బాణాసంచా కాల్చారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సంబరాల్లో పాల్గొన్న పిల్లి దంపతులు

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ రావడంపై టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శనివారం రూరల్ మండలం వలసపాకల గ్రామంలో పిల్లి స్వగృహం వద్ద పెద్దఎత్తున బాణ సంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా పిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఐదేళ్ల రాక్షస పాలనకు శనివారంతో ముగిసిందని, రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ద్వారా సంక్షేమ, అభివృద్ధి పాలన రానుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కో కో ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, కర్రి వెంకటరాజు, మిరపల ప్రకాష్, సరిదే నాగ హరినాథ్, కొమిరిశెట్టి నరసింహారావు, పడమటి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమాని శేఖర్ మాట్లాడుతూ బేదాభిప్రాయాలు లేకుండా టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విజయానికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులను గెలిపించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి మండపేట

మండలంలోని అర్తమూరు గ్రామంలో ఎస్‌బిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 169 వ ఉచిత హోమియో శిబిరాన్ని ట్రస్ట్ డైరెక్టర్ సత్తి రామకష్ణారెడ్డి, మాజీ ఉమ్మడి రాష్ట్ర గెడ్డంగిల శాఖ సంస్థల చైర్మన్, వ్యాపారవేత మేడపాటి నాగచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత హోమియో వైద్యాన్ని చేరే చేయడంలో కషి చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ ను అభినందించారు. శిబిరంలో రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య వైద్య బందం వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బిళ్లకుర్రులో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-కొత్తపేట

బిళ్లకుర్రు గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. గ్రామంలోని యెలిశెట్టివారిపాలెం, నెల్లివారిపేట, మాసాయిపేట, డేగలవారిపాలెం ఏరియాల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

ముందుగానే ప్రలోభాల జాతర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికార వైసిపి మహిళా ఓటర్లకు ప్రలోభాల ఎర వేయటం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. సార్వత్రిక ఎన్నికలకు నగరా మోగకుండానే అధికార పార్టీ ప్రలోభాలకు తెరలేపింది. ఈ నేపథ్యంలో వారం రోజుల ముందునుంచే అధికార పార్టీ ప్రలోభాల జోరు పెంచింది. వాలంటీర్లను ప్రసన్నం చేసుకునేందుకు విలువైన గృహోపకణాలు అంద జేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అధికార యంత్రాంగం సహాయంతో పేదలందరికీ ఇళ్లు అనే పథకం పేరుతో జిల్లా వ్యాప్తంగా ఇళ్ల పట్టాల పంపిణీ ఆర్భాటంగా చేపట్టింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ అర్హత కల్పిస్తూ పట్టాలు జారీ చేసింది. అయితే ఇప్పటికీ ప్రతి సచివా లయంలో వందల కొద్దీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాల్సి ఉన్నాయి. మరోవైపు ఓటర్ల జాబితా ఆధారంగా వలంటీర్ల ద్వారా మహిళా ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి చీరల పంపిణీ చేయ టంపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. రాజమహేంద్ర వరంలో తేదేపా నేతలు మరో అడుగు ముందుకు వేసి చీరలను దగ్ధం చేశారు. మౌళిక వసతులలో ఒకటైన తాగునీ సౌకర్యంపై దృష్టి పెట్టలేకపోయారంటూ ఎద్దేశాచేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అధికార విపక్ష నేతలు ఏ మేరకు నిబంధనలు అనుసరిస్తారో వేచి చూడాలి.

రబీ సాగుకు నీటి గండం

రబీ సాగుకు నీటిగండం మొదలైంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావడంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విధితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి రెండు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్థతను వైసిపి ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రతి ఏటా వేసవి పనులు నిర్వ హించి కాల్వల ఆధునీకరణ, తూటు కాట తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్దాల కాలంగా ఆనయవాయితీగా వస్తోంది. డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించింది. వ్యవసాయ రంగంలో కీలకమైన నీటి వనరులు నిల్వ చేసుకోవాలనే ముదుచూపు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది. తాజాగా శివారు పొలాలకు నీరందక నెర్రలీనటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాల్వల ఆధునీకరణ చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు.

ఎన్నికలకు రంగం సిద్ధం

సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. అధికార వైసిపి, ప్రతిపక్ష తేదేపా ఇప్పటికే అభ్యర్థుల జాబితాను పూర్తి స్థాయిలో ప్రకటించిన విషయం విధితమే. టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఎంపి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగు తూనే ఉంది. ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ ప్రకటించడంతో అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. అయితే టిడిపి, బిజెపి, జనసేన కూటమిలో ఆశావహులకు సీట్లు లేకపోవటంతో అనుయాయులు, నేతలు భగ్గుమంటున్నాయి. పిఠాపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో తిరుగు బావుటా ఎగరేసేందుకు సిద్ధం అయ్యారు. అధినేతలు ఏ మేర కు బుజ్జగిస్తారో వేచి చూడాల్సి ఉంది. లేని పక్షంలో కూ టమి నేతలకు చుక్కెదురు తప్పదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. మరోవైపు అధికార పార్టీలోనూ అంతర్మధనం మొదలైంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులకు స్థాన చలనం కల్పించిన విషయం విధితమే. ఈ మేరకు అక్కడి కార్యకర్తలను కలుపుకుని వెళ్లడానికి అష్టకష్టాలు పడుతున్నారు. కార్యకర్తలతో పాటు ప్రజల నమ్మకాన్ని ఏ మేరకు పొందగలరో వేచి చూడాలి.

ఎన్నికల మార్గదర్శకాలను అమలు చేస్తాం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఎన్నికల మార్గదర్శ కాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని పలువురు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పలు డివిజన్, మండల కేంద్రాల్లో ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రంగంలోకి దిగారు. **కాకినాడ రూరల్** ఎన్నికల సంఘం మార్గదర్శకాలను సమర్థవం తంగా అమలు చేస్తామని ఆర్‌డిఒ కిషోర్ తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచే డివిజన్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కాకినాడ రూరల్ (38)కు సంబంధించి 264 పోలింగ్ బూత్‌లు ఉండగా 91 బూత్‌లు సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. రాజకీయ నాయకు లకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు 24 గంటల్లో తొలగించాలని లేని పక్షంలో ప్రభుత్వ అధికారులు తొలగిస్తారని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. **జగ్గంపేట** ఎన్నికలకు అన్ని సిద్ధం చేసినట్లు జగ్గంపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియా తో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమా వళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, అందుకు

మీడియాతో మాట్లాడుతున్న పెద్దాపురం ఆర్‌డిఒ సీతారామారావు

రాజకీయ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ అధికారులకు సహకరించాలని కోరారు. **పిఠాపురం** ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎస్.రామసుందర్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యా లయంలో ఆయన మీడియాతో మాట్లా డారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అందుకు అనుగుణంగా మసులు కోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారాల్లో లౌడ్ స్పీకర్స్‌ను వినియోగిస్తే పోలీసుల అనుమతి తప్పనసరిగా తీసుకోవాలన్నారు. మతప రమైన ప్రాంతాల్లో ఎటువంటి ప్రచారాలు చేయరాదని అన్నారు. 10వ తరగతి పరీక్ష కేంద్రాల పరిధిలో ప్రచారానికి వెళ్లే వాళ్లు విద్యార్థులకు ఇబ్బందులు కలిగించకుండా తమ ప్రచారాన్ని చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎఆర్ఒ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, ఎంపిడిఒ చిన్నా రావు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక ఎంపిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపిడిఒ ఎస్.డి.శ్యాంసుందర్ మాట్లాడారు. గ్రామాల్లో కార్యదర్శిలకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫోటోలు పోస్టర్లు తొలగించాలని, 48 గంటల్లో బహిరంగ ప్రాంతాల్లో పోస్టర్లు తొలగించాలని, 72 గంటల్లో ప్రయివేట్ స్థలాల్లో ఫ్లెక్సీలు పోస్టర్లు తొలగించాలని ఆదేశించామన్నారు. అభ్యర్థులు మతపరమైన ప్రచారం చేపట్టి రాదని తెలిపారు. కార్యాలయం వద్ద ఉన్న సిఎం జగన్, వైఎస్ఆర్ ఫొటోలకు క్లాత్‌లతో కప్పివేశారు. ఈ సమావేశంలో ఇవిపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డి పాల్గొన్నారు. **పెద్దాపురం** ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఇకపై రాజకీయ పార్టీల నాయకులు అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతా రామారావు సూచించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సెగ్మెంట్లో 200 పోలింగ్ కేంద్రాల్లో 2,12,579 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 200 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 46 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఆర్‌డిఒ కార్యా లయంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమా వేశంలో పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు కెవి.పద్మావతి, రామారావు, తహశీ ల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **కాజులూరు** ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిం చాలని తహశీల్దార్ ఎ.శాంతిలక్ష్మి అన్నారు. శనివారం ఎన్నికల కోడ్ అమలులోకి రావడం తో మండలంలోని వివిధ గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం తోపాటు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిం చాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఒక్కరోజు సమయం కావాలని పలువురు నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు ఆదివారం సాయంత్రంలోపు ఫ్లెక్సీలు తొలగించాలని పంచాయతీ అధికారులు రాజకీయ పార్టీలకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రి కొట్టు

ప్రజాశక్తి - అన్నవరం

స్థానిక సత్యదేవ డిగ్రీ కళాశాల సమీపంలో కొత్తగా రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు చేపడు తున్న స్వామి నమూనాలయం ఆవరణలో ప్రసాదం విక్రయ కౌంటర్‌ను మంత్రి కొట్టు సత్యనారాయణ టెంకాయ కొట్టి హడావిడిగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి స్థానిక విలేకరులతో

అన్నవరం దైవ దర్శనానికి వెళ్తున్న మంత్రి కొట్టు

మాట్లాడుతూ బైపాస్‌లో ప్రస్తుతం ఒకవైపున స్వామి నమూనాలయం వద్ద భక్తులు ప్రసాదాలు కొనేందుకు రాజమహేంద్రవరం వైపు వెళ్లేవాళ్లు రోడ్డు దాటే పరిస్థితి ఉందని, దీనివలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఇటువైపు కూడా కొత్తగా స్వామి నమూనాలయం నిర్మిస్తు న్నామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రసాదాలు అమ్మే కౌంటర్‌ను ముందుగానే ప్రారంభించడం జరిగిందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అనంతరం కొండపైకి వచ్చిన మంత్రికి దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్ ఆలయ లాంచనాలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సత్యదేవుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్ఓ కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

మత్యంరాజు బాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట సీనియర్ వైసిపి నాయకులు, లారీ యూనియన్ మాజీ అధ్యక్షులు ముత్యం రాజుబాబు, మరో 100 మందితో టిడిపిలో చేరారు. శనివారం స్థానిక పాత తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ముత్యం రాజుబాబు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపితో కలసి పనిచేసేవారికి ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. పార్టీలో ఇప్పటికే పనిచేస్తున్న సీనియర్లు కొత్తగా వచ్చినవారిని కలుపుకుని టిడిపి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, పట్టణ పార్టీ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, రైతు నాయకులు కంటే జగదీష్ మోహన్‌బాబు, టిడిపి కౌన్సిలర్ బలుసు వాసు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జలజీవన్ మిషన్, ఒఎన్‌జిసి సిఎస్ఆర్. నిధులతో ముమ్మిడివరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించినట్లు ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ.35 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ పొన్నాడ

ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 80 ట్యాంకులు నిర్మించి ప్రజలకు తాగునీరు తీసుకొచ్చి నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు సామ్యూల్‌సాగర్, స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, మాతరాజు, పోతాబత్తుల నూకరాజు, చెక్క కామేశ్వరరావు, రేకాడి నరసింహమూర్తి పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ రూరల్ మండలంలో భాషా ప్రయోక్త రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరా ములు అని గ్రంథాలయ విశ్రాంతి అధికారి సిహెచ్. సుబ్బా రావు కొనియాడారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా

కాకినాడ రూరల్‌లో నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

ఆయన మాట్లాడుతూ 1901 మార్చి 16న మద్రాసులో జన్మిం చిన పొట్టి శ్రీరాములు గాంధీజీ అనుచ రుడిగా స్వాతంత్ర ఉద్య మంలో పాల్గొ న్నారని అన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్య మాలలో పాల్గొని జైలు శిక్ష అనుభవిం చారని అన్నారు. 58 రోజులపాటు ఆమ రణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అనం తరం ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎ.రత్నప్రసాద్, బి.సత్య నారాయణ రాజు పాల్గొన్నారు. **కరప** మండలం లోని గురజ నాపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరా ములు జయంతిని నిర్వహించారు. హెచ్ఎం ఎ.సాయి మోహన్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టాఫ్ సెక్ర టరీ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఐ. ప్రసాద రావు మాట్లాడారు. ఈ కార్య క్రమంలో వివి.రమణ మూర్తి, జి.అర్జున్ రావు, టి.వేణుగోపాల్ పాల్గొ న్నారు. **సామర్లకోట** స్థానిక ఎంపిపి కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు జయవంతిని ఘనంగా నిర్వహించారు.

సామర్లకోటలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న అధికారులు

ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ ఎస్‌డి.శ్యాంసుందర్, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మటన్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **పెద్దాపురం** స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన జయంతి కార్యక్రమంలో ఆర్‌డిఒ సీతారామారావు, ఎంపిపి కార్యాలయంలో ఎంపిడిఒ ఉషారాణి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కెవి పద్మావతి ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు.

దంతాల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మనం తీసుకునే ఆహారం జీర్ణం కావాలంటే దంతాల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం ముఖ్యమని ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ శ్రీవల్లి అన్నారు. సర్పవరం జంక్షన్‌లో ఇండియన్ దంత వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దంతాలు దృఢంగా, పటిష్టంగా ఉంటేనే అన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోగలుగుతామని అన్నారు. తద్వారా పోషకాలు సక్రమంగా అంది రోగ నిరోధక శక్తి పెరుగుతుం దన్నారు. దంతాల మధ్య ఖాళీలు ఏర్పడితే వెంటనే దంత వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని అన్నారు. దంతాల పట్ల నిర్లక్ష్యం వహించరాదని డాక్టర్ శ్రీవల్లి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

ప్రజాశక్తి - కాకినాడ

రానున్న ఎన్నికల నేపథ్యంలో కాకినాడ ముఖ ద్వారాల వద్ద ఏర్పాటు చేసే చెక్‌పోస్టుల వద్ద పటిష్టవంతమైన నిఘా ఏర్పాటు చేయాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశిం చారు. శనివారం పోలీస్, రెవెన్యూ, ఎన్నికల సిబ్బందితో కలిసి ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను

చెక్‌పోస్టులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

పరిశీలించారు. ప్రతాప్‌నగర్ వంతెన, ఉప్పలంక జంక్షన్, కుంభాభిషేకం రేవు ప్రాంతాల్లో స్టేటిక్ సర్వేలైన్స్ బృందాల పర్యవేక్షణ చేయాల్సిన అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. ఆయా ప్రాంతాలకు వెళ్ళిన ఆర్ఒ అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. బయటప్రాంతాల నుంచి సిటీ నియోజకవర్గంలోకి డబ్బు, మద్యం ఎలా నియంత్రించాలనే అంశంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ పర్యటనలో డిఎస్‌పి హనుమంతరావు, నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఇ పి.వెంకటరావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఇఇ మాధవీ, తహశీల్దార్ దొర, ఎఇ వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలనకు విముక్తే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలోని వైసిపి అరాచక పాలనకు విముక్తి కల్పించడమే లక్ష్యం కావాలని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు, బిసి డిక్లరేషన్ పోస్టర్స్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగించడం కోసమే టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయని అన్నారు. వైసిపి అసమర్థ పాలనతో రాష్ట్ర ప్రజలు దగాపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ సంక్షేమ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వనమాడి

పథకాలు, బిసి డిక్లరేషన్ అమలు చేసి ప్రజలకు ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు,నాయకులు నిమ్మగడ్డ జగదీష్, తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, ఆమెన్ జైన్, ఒమ్మి బాలాజీ, పలివెల రవి అనంతకుమార్, పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినవి

కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, సర్పవరం, భావనారాయణపుపం, డో.నెం. 6-48రు నివాసియైన శీలం సురేష్ గారి భార్య **శీలం కుమారి,** వయస్సు 33 సం॥లు అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నేను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును ది.10-03-2024వ తేదీ ఉదయం 10.30 ని॥లకు జెరాక్స్ తీయు నిమిత్తము నా ఇంటి వద్ద నుండి సర్పవరం వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.Y5201467 పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. సదరు పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

శీలం కుమారి
W/o. సురేష్, డో.నెం.6-48,
భావనారాయణపురం, సర్పవరం
కాకినాడ, సెల్: 95420 22554

యానాం వార్తలు

వైద్యనాథంను సత్కరిస్తున్న మల్లాడి సత్తిబాబు

కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యం

ప్రజాశక్తి - యానాం

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ సిఎల్‌పి లీడర్, పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ వైద్యనాథన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన యానాంలో పర్యటించారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ యానాం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, అధ్యక్షుడు అర్థాని దినేష్‌లు ఘనంగా స్వాగతం పలికారు. తొలుతగా పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్థానిక జివిఎస్ హోటల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎంపి అభ్యర్థికి అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటంశెట్టి రామంమూర్తి, విళ్ల చిన్ని, మల్లాడి బీరాస్వామి, రాముండు, దవులూరి పతి, దున్నా చక్రవర్తి, సత్య పెరుమాళ్, లంక బంగారం, మున్నా, తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 19న పుదుచ్చేరి లోక్‌సభకు ఎన్నిక

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి మొదటిదశలో ఏప్రిల్ 19న పోలింగ్ జరిగనుంది. ఈనెల 20న నోటిఫికేషన్, నామినేషన్లు దాఖలు చేయడానికి ఆఖరు తేదీ 27, అభ్యర్థుల నామినేషన్ల స్క్రూటీ 28, నామినేషన్ల ఉపసంహరణ 30, ఏప్రిల్ 19న పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ఈ మేరకు శనివారం పుదుచ్చేరి ఎన్నికల అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల నగారా మ్రోగడంతో ఎన్నికల కోడ్ అమలలోకి వచ్చిందని, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు బ్యానర్లు తొలగించాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

చిన్నాసెంటర్‌కు వెంకన్న రథం

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలలో భాగంగా స్వామి రథాన్ని చిన్నా సెంటర్‌కు ట్రాక్టర్ సహాయంతో చేర్చారు. స్వామి రథోత్సవం ఈనెల 22న జరగనుంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ఖండవల్లి రామకృష్ణ, కళ్యాణోత్సవాల కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - యానాం

యానాంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో శనివారం కురసాంపేట, అయ్యన్న నగర్ గ్రామాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సిహెచ్.నరేష్, ఎస్.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వలంటీర్లు గ్రామస్తులతో మమేకమై విద్య యొక్క ప్రాముఖ్యత, యువత, పిల్లలకు ఉన్నత విద్యావకాశాలు గురించి వివరించారు.

పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి - యానాం

సమాచార శాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నిర్వహించారు. స్థానిక యానాం ఫెర్రీ రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పోలీస్ సిబ్బంది, పూలమాలలు వేసి నివాళులర్పించారు.